# గూడెం బీజేపీలో ముదురుతున్న వర్గపోరు!

### పోటాపోటీగా కార్యక్రమాలు.. నేతల మధ్య పెరుగుతున్న దూరం

### జిల్లా అధ్యక్షుడి కార్యక్రమానికి టౌన్ అధ్యక్షుడి గైర్హాజరు

**76 జీఓ అమలు కోసం టౌన్ అధ్యక్షుడి దీక్షలో కనిపించని జిల్లా అధ్యక్షుడు**

**భద్రాద్రి బ్యూరో, సెప్టెంబర్ 1 (తెలంగాణ వాణి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో బీజేపీ నేతల మధ్య సమన్వయ లోపం మరోసారి చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ విస్తరణకు అధిష్ఠానం ప్రాధాన్యం ఇస్తున్న వేళ.. కొత్తగూడెంలో మాత్రం జిల్లా, పట్టణ నాయకత్వం వేర్వేరు కార్యక్రమాలతో ముందుకు సాగడం పార్టీలో అంతర్గత విభేదాలపై అనుమానాలకు తావిస్తోంది. ఒకే సమయంలో రెండు వేర్వేరు కార్యక్రమాలు నిర్వహించడం, పరస్పరం ముఖ్య నాయకులు గైర్హాజరు కావడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు హౌస్ అరెస్టుకు నిరసనగా జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కొత్తగూడెం పోస్టాఫీస్ వద్ద ఆందోళన నిర్వహించగా.. టౌన్ అధ్యక్షుడు శీలం విద్యాసాగర్ ఆ కార్యక్రమంలో కనిపించలేదు. మరోవైపు కొత్తగూడెం పట్టణంలో 76 జీఓ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ టౌన్ అధ్యక్షుడు శీలం విద్యాసాగర్ చేపట్టిన నిరసన దీక్షకు జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి హాజరుకాకపోవడం కూడా చర్చనీయాంశమైంది. పార్టీకి సంబంధించిన ముఖ్య కార్యక్రమాల్లో జిల్లా, పట్టణ స్థాయి నాయకులు సమన్వయంతో పాల్గొనాల్సి ఉండగా.. ఇరువురు నేతలు వేర్వేరు కార్యక్రమాల్లో కనిపించడం కేడర్‌లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.





**ఒకరి కార్యక్రమం.. మరొకరికి సమాచారం లేదా?**

ఇరువురు నాయకులు ఒకరి కార్యక్రమానికి మరొకరు హాజరుకాకపోవడంతో పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. టౌన్ అధ్యక్షుడు చేపట్టిన 76 జీఓ నిరసన దీక్ష విషయం జిల్లా అధ్యక్షుడికి తెలియదా? సమాచారం ఉన్నప్పటికీ హాజరు కాలేదా? అదే విధంగా జిల్లా అధ్యక్షుడు నిర్వహించిన నిరసన కార్యక్రమానికి టౌన్ అధ్యక్షుడికి సమాచారం లేదా? ఆహ్వానం అందలేదా? అనే చర్చ కార్యకర్తల్లో సాగుతోంది.

**కేడర్‌లో అయోమయం**

పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాల్సిన సమయంలో జిల్లా, పట్టణ నాయకత్వం మధ్య సమన్వయం కొరవడినట్లు కనిపించడం కార్యకర్తలను అయోమయానికి గురిచేస్తోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నేతలు ఒకే వేదికపై కలిసి పనిచేయాల్సిన పరిస్థితిలో వేర్వేరు కార్యక్రమాలు నిర్వహించడం పార్టీ కార్యక్రమాల ప్రభావంపైనా ప్రశ్నలు లేవనెత్తుతోంది. కొత్తగూడెం నియోజకవర్గంలో బీజేపీ తన రాజకీయ ఉనికిని మరింత బలోపేతం చేసుకునే ప్రయత్నం చేస్తున్న తరుణంలో నాయకుల మధ్య దూరం పెరుగుతున్న సంకేతాలు పార్టీకి ఇబ్బందికరంగా మారే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ఈ పరిణామాలపై పార్టీ అధిష్ఠానం దృష్టి సారించి జిల్లా, పట్టణ నాయకత్వాల మధ్య సమన్వయం పెంచాల్సిన అవసరం ఉందని పార్టీ శ్రేణులు అభిప్రాయపడుతున్నాయి.

## రిజిస్ట్రేషన్ ఆఫీసులో ఓ ఉద్యోగి 'చేతివాటం'

### ఆ ఉద్యోగి అదనపు ఆదాయం రోజుకు రూ.4 వేలు పైనే

### వేలిముద్ర, పత్రాలపై ముద్రకు రూ.100--200 వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు




**భద్రాద్రి బ్యూరో, సెప్టెంబర్ 01 (తెలంగాణ వాణి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలోని రిజిస్ట్రేషన్ ఆఫీసులో కిందిస్థాయిలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి అదనపు ఆదాయం రోజుకు కనీసం నాలుగు వేల పైనే. రిజిస్ట్రేషన్ ఆఫీసుకు వచ్చే వాళ్లంతా తప్పనిసరిగా అక్కడున్న కింది స్థాయి ఉద్యోగి సమక్షంలో వేలిముద్ర వేయాల్సి ఉంటుంది. సంబంధిత పత్రాలపై మోరు కూడా ఆ ఉద్యోగ వేస్తుంటారు. ఎందుకుగాను ఒక్కో దరఖాస్తు సంబంధించి రూ. 100 నుంచి 200 వరకు వసూలు చేస్తున్నారు. తప్పని పరిస్థితుల్లో దరఖాస్తుదారులు అడిగినంత ఇచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. లేనిపక్షంలో దరఖాస్తులు పెండింగ్ పెట్టడం జరుగుతుందని భయంతో అడిగినంత తిచ్చుకుంటూ పనిచేయించుకునే దుస్థితి రిజిస్ట్రేషన్ ఆఫీసులో నెలకొంది. కింది స్థాయి ఉద్యోగి అయినప్పటికీ తాను చేయాల్సిన విధులను పక్కనపెట్టి ఆఫీసర్ లాగా ఆయన దబాయించడం ఇక్కడ కామన్ గా మారింది. అదనపు వసూళ్లపై రిజిస్ట్రేషన్ శాఖ అధికారి ప్రత్యేక దృష్టి పెట్టాలని దరఖాసుదారులు కోరుతున్నారు

## అథ్లెటిక్స్ కోచింగ్‌లో ఆరు వారాల శిక్షణ పూర్తి

### రియాజ్ పాషాకు సర్టిఫికెట్ అందజేసిన జిల్లా క్రీడల అధికారి



**కొత్తగూడెం, సెప్టెంబర్ 1 (తెలంగాణ వాణి):** రామవరం ప్రాంతానికి చెందిన అథ్లెటిక్స్ కోచ్ ఎస్.కె. రియాజ్ పాషా పాటియాలలోని నేతాజీ సుభాష్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్‌లో సాయ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరు వారాల అథ్లెటిక్స్ శిక్షణ కోర్సును విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా యువజన మరియు క్రీడల కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా యువజన మరియు క్రీడల అధికారి పరంధామ రెడ్డి రియాజ్ పాషాకు సర్టిఫికెట్ అందజేసి అభినందించారు. జాతీయ స్థాయిలో పొందిన శిక్షణను ఉపయోగించుకొని స్థానిక అథ్లెటిక్స్ క్రీడాకారులకు మెరుగైన శిక్షణ అందించాలని ఆయన ఆకాంక్షించారు. రియాజ్ పాషా కోర్సు పూర్తి చేయడం పట్ల అంతర్జాతీయ అథ్లెటిక్స్ కోచ్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపూరి రమేష్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రతినిధి మహీధర్, జాతీయ క్రీడాకారుడు ఎం.డి. బాబ్జి అభినందనలు తెలిపారు. అథ్లెటిక్స్‌లో నూతన శిక్షణా పద్ధతులను నేర్చుకొని వాటిని క్రీడాకారుల అభివృద్ధికి వినియోగించడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ కోచ్‌లు డి. మల్లికార్జున్ రావు, సుస్మాబాయి పాల్గొన్నారు.